క్లుప్తంగా

ఆకట్టుకున్న మహిషాసురమర్దిని నృత్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై చెన్నైకు చెందిన మధుర కళానికేతన్‌కు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన మీనాక్షి– మహిషాసురమర్దిని నృత్య రూపకం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం డాక్టర్ మల్లంపల్లి మాధవి పర్యవేక్షణలో చెన్నైకు చెందిన కళాకారులు గురు, రోజారాణి, దుర్గా, నటరాజ్ బృందం మహిషాసురమర్దిని నృత్య రూపకాన్ని ఆకట్టుకునే రీతిలో ప్రదర్శించారు. కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాన్ని భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం కళాకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

కవి సమ్మేళనాలను ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: కవులను, కవి సమ్మేళనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని క్రామేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు పేర్కొన్నారు. ఆర్ష్ ఫౌండేషన్, ఏపీ భాషా సాంస్కృతిక సమితి సౌజన్యంతో గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం అమరావతి ఇతివృత్తంగా కవి సమ్మేళనం నిర్వహించారు. గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ కవులు సమాజంలో వస్తున్న మార్పులను అన్వేషిస్తారన్నారు. కవి క్రాంతి దర్శిని అని భవిష్యత్‌ను తన కవిత్వంలో వినిపిస్తాడని అన్నారు. కవిత్వంలో పునరుక్తులు, పునశ్చరణలు లేకుండా చూడాలని చెప్పారు. ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు కవి సమ్మేళనాలు, సాహిత్య సభలను ప్రోత్సహించాలని సూచించారు. ఆర్ష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పొట్లూరి హరికృష్ణ మాట్లాడుతూ కవులు, రచయితలు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక సాహిత్య సభలను నిర్వహిస్తున్నామని కవులను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు అమరావతి అంశంగా స్వీయ కవితా గానం చేశారు. నిర్వాహకులు కవులకు జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు.

తూనికలు, కొలతలపై అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతి వినియోగదారుడు తూనికలు, కొలతలపై కనీస అవగాహన కలిగి ఉండాలని ఏలూరు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని పలు చికెన్, మటన్, చేపల దుకాణాలతో పాటుగా కిరణ షాపులను ఆయన తనిఖీ చేశారు. నాన్ వెజ్ మార్కెట్‌లో ఆదివారం అమ్మకాలు అధికంగా జరుతుండటంతో తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఆయా దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటాలను పరిశీలించారు. అక్కడి వినియోగదారులకు పలు సూచనలు చేశారు. ఎలక్ట్రానిక్ కాటాల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తూనికలు, కొలతల శాఖ ద్వారా లైసెన్స్, సీల్ లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలకు వినియోగిస్తున్న ఇద్దరు వ్యాపారులకు అదనపు రుసుము చెల్లించాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. తూకంలో అవకతవకలు ఉన్నట్లుగా గుర్తించిన మరో ఇద్దరు వ్యాపారులకు రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా తూకం సరి చేసుకోవాలని చెప్పారు. చికెన్, మటన్ దుకాణాల్లో బరువుతో పాటుగా రేట్‌ను సూచించే ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగించాలని ఆదేశించారు.

వ్యర్థాలకు నిలయంగా బందరు కాలువ



పెనమలూరు: సాగుకాలువ అయిన బందరు కాలువ పరిస్థితి దయనీయంగా మారింది. తూర్పు కృష్ణకు సాగునీరు అందిస్తున్న బందరు కాలువ పరిస్థితి నానాటికి అధ్వానంగా మారుతోంది. పంటల సాగుకు ఎంతో ప్రాధాన్యత కలిగిన బందరు కాలువను పరిరక్షించటంతో ప్రభుత్వం విఫలమవుతోంది. నేడు బందరు కాలువలో గుర్రపు డెక్క, వ్యర్థాలతో నిండిపోయి దారుణంగా ఉంది. ఖరీఫ్ సీజ్ మొదలయినా నేటికీ ప్రభుత్వం బందరు కాలువను పూడిక తీయలేదు. యనమలకుదురు లాకులు, తాడిగడప వంతెన, పెనమలూరు, గోసాల వంతెనల వద్ద బందరు కాలువలో వ్యర్థాలు కాలువలో పెద్ద ఎత్తున వచ్చి పూడుకుపోయింది. కాలువలో తీవ్రదుర్గంధం వస్తోంది.

కూటమి మోసాలను ప్రజలకు వివరించండి

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు
- డివిజన్లలో బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 53వ డివిజన్‌లో ఆ పార్టీ డివిజన్ ఇన్‌చార్జ్ గురుమహంతు మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని స్థానిక రాయల్‌హోటల్ సెంటర్‌లో నిర్వహించారు. అలాగే 51వ డివిజన్‌లో స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో డివిజన్ ఇన్‌చార్జి తుపాకుల గురుమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలంపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ల ఇన్‌చార్జులు బంక చాముండేశ్వరి, అయితా కిషోర్ నాయకులు పాల్గొన్నారు. బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, వైఎస్ జగన్ ప్రసంగాన్ని టీవీలో చూపించారు. ఇంటింటికి క్యూఆర్ కోడ్‌తో వెళ్లి ప్రజలతో ఆ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయించాలని, కూటమి మోసాలను వివరించాలని కోరారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికి వెళ్లి జగన్ అమలు చేసిన పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా, ప్రజలకు ఎంత లబ్ధి చేకూరిందనే విషయాలను తెలుసుకున్నామని వెలంపల్లి చెప్పారు. గడిచిన ఏడాదిలో దాదాపు ఐదు లక్షల మంది పింఛను లబ్ధిదారులను తొలగించారని వెల్లడించారు. కూటమి నేతలు గుడ్‌మార్నింగ్ పేరుతో డబ్బులు వసూలు చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు పిళ్లా రవి, ఉగ్గిన కృష్ణారావు, ఎండీ కాజా, ముసురు చిన్ని తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో కలసి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్ ప్రదర్శిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు



51 వడివిజన్‌లో కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు ఇతర నేతలు

వించిపేట(విజయవాడపశ్చిమ): దేశ చరిత్రలోనే ఇచ్చిన మాట నిలబెట్టుకొని ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేసి ప్రజలకు మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జీ వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక 50వ డివిజన్ గూడెల పాపయ్య వీధిలో స్థానిక డివిజన్ ఇన్‌చార్జ్ బంక విజయ ఆధ్వర్యంలో ఆదివారం నాడు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సుపరిపాలన పేరుతో కూటమి నేతలు ప్రజల వద్దకు వచ్చినపుడు చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజలు ప్రశ్నించే విధంగా చైతన్యం తీసుకురావాలని వెలంపల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 50వ డివిజన్ ఇన్‌చార్జ్ బంక విజయ, చాముండేశ్వరి, పార్టీలో వివిధ హోదాల్లో పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

46వ డివిజన్‌లో...

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 46వ డివిజన్ పరిధిలోని మేయర్ రాయన భాగ్యలక్ష్మి నివాసంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు రాయన నరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి హాజరయ్యారు. బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ చంద్రబాబు నాయుడు మ్యానిఫెస్టోను గుర్తు చేస్తూ సమావేశం నిర్వహించారు. తొలుత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వెలంపల్లి శ్రీనివాసరావు, రాయన భాగ్యలక్ష్మీ, ఇతర పార్టీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలతో కూడిన బాండ్లను ప్రదర్శించారు. చంద్రబాబునాయుడు మోసాలను ప్రజలకు వివరించేలా రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వెన్నం రజనీకుమార్, దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, మైనార్టీ నాయకులు ఆదిల్, ట్రాక్టర్ రాము, అయితా కిశోర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెలంపల్లి , మేయర్ భాగ్యలక్ష్మి

42వ డివిజన్‌లో....

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురం 42వ డివిజన్‌లో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' చంద్రబాబు మేనిఫెస్టో గుర్తు చేస్తూ డివిజన్ స్థాయి వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి నివాసంలో నిర్వహించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

మోసపూరిత హామీలతోనే గద్దనెక్కిన కూటమి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి నాయకులు మోసపూరిత హామీలతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఆ మోసాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో 39వ డివిజన్ విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బొండా నిరీష్, డివిజన్ నేత డివి రెడ్డి ఆయా డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిట్టినగర్‌లో

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సూపర్ సిక్స్ పథకాలను ఇస్తామని ప్రజలను నమ్మించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పథకాలకు నీళ్లొదిలిందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 48వ డివిజన్ వాగు సెంటర్‌లోని బాల భక్తసమాజంలో ఆదివారం బాబు షూరిటీ– మోసం గ్యారంటీ అంటూ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేసుకుంటూ సమావేశం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు(జగ్గు) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత చంద్రబాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లును టీవీలలో చూపారు. అనంతరం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చి అమలు చేసిన హామీలను టీవీలలో చూపారు. వైఎస్సార్ సీపీ నేతలు ఇంటింటికి వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి కూటమి మోసాలను వివరించాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి అయితా కిశోర్, యంగల శ్రీనివాసరావు, చిచ్చా, బడే, దాసిన ఏసు, వానపల్లి త్రిమూర్తులు, కె. రజనీ, కె.నాగు, రాళ్లపిళ్ల సూరిబాబు, రాంపిళ్ల వాసు, మజ్జి శ్రీనివాసరావు, తొత్తడి వరలక్ష్మీ, విమల, గురువులు, శివ, అప్పన్న, మనోహర్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



48వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

మనిషి చేయగలిగే గొప్ప సేవల్లో రక్తదానం ఒకటి



లబ్బీపేట(విజయవాడతూర్పు): మనిషి చేయగలిగే గొప్ప సేవలలో రక్తదానం ఒకటి అని మౌలానా మిర్జా జహీర్ అబ్బాస్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండు సార్లు కనీసం రక్తదానం చేయాలని ఆయన సూచించారు. నగరంలోని మసీదు– ఇ –హుస్సేన్‌లో ఆ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ముస్లిం సంక్షేమ సమితి అధ్యక్షుడు ముఖ్తార్ అలీ ,మౌలానా మీర్ జావీద్ అలీ బాఖరీలతో కలిసి మౌలానా మిర్జా జహీర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎందరో ప్రాణాలు పోతున్న పరిస్థితి ఉందని తెలిపారు. మానవసేవయే మాధవ సేవ అని, కేవలం మనిషి తన కోసం కాకుండా పొరుగు వారికి ఏదో రకంగా సేవా చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం మొహర్రం సంతాపదినాల్లో తమ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదానం శిబిరాన్ని ఈ ఏడాది కూడా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో పురోగతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస ద్విచక్రవాహనాల చోరీ కేసుల్లో పురోగతి సాధించినట్లు సీఐ ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 39 ద్విచక్ర వాహనాలు చోరీ అయినట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ద్విచక్రవాహనాల దొంగలపై ప్రత్యేక దృష్టి సారించి 22 కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. వారి నుంచి 32 బైక్‌లను రికవరీ చేయడం జరిగిందన్నారు. ఎస్ఎన్‌పురం పీఎస్ పరిధిలోని గాంధీనగర్, సాంబమూర్తి రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు, గవర్నమెంట్ ప్రెస్, అంబేద్కర్ కాలనీ, బావాజీ పేట, శ్రీనగర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, ముత్యాలంపాడు, పసుపుతోట తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపటి నుంచి భగవద్గీత ప్రవచనాలు

విజయవాడ కల్చరల్: జగద్గురువులు శంకరభాష్య భగవద్గీత అంశంగా ఏడాది పాటు రామకోటిలో నిర్వహించనున్న ప్రవచనాలు 29వ తేది నుంచి ప్రారంభం కానున్నట్లు ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నెలల పాటు ప్రతి నెలా మూడు రోజులు ప్రవచనాలు జరుగుతాయని చెప్పారు. శంకరభాష్య భగవద్గీతను ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు అడవికొలను భానుమూర్తి, డాక్టర్ మేడూరి సూర్యనారాయణ శర్మ, డాక్టర్ అంబటిపూడి రాధేశ్యాం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, డాక్టర్ కుప్పా బీలేశ్వరశర్మ, శిష్టి ప్రసన్నాంజనేయ శర్మ, నండూరి కువల దత్తా, కేవీ శర్మ శౌత్రి, రేమిల్ల వెంకట రామకృష్ణ శాస్త్రి, నారుమంచి అనంతకృష్ణ, డాక్టర్ జమ్మలమడక శ్రీనివాసశాస్త్రి ప్రవచనం చేస్తారని తెలిపారు.

కోతకు గురవుతున్న కెనాల్ రోడ్డు

- నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తున్న వైనం
- ఆందోళనలో స్థానిక ప్రజానీకం
- బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్న అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో ప్రధాన రహదారుల్లో ఒకటైన కెనాల్‌రోడ్డు కోతకు గురవుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే కెనాల్‌రోడ్డు ప్రమాదభరితంగా మారినా వాటి మరమ్మతులు, ఇతర నిర్మాణాలకు చర్యలు చేపట్టకపోవటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో రెండు మూడు సార్లు కోతకు గురైన కెనాల్‌రోడ్డు వల్ల పెను ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పలువురు మృత్యువాత పడిన దాఖలాలు ఉన్నాయి. అయినా అధికారులు కెనాల్‌రోడ్డు భద్రతపై దృష్టి పెట్టకపోవటం పాలకుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రమాదాలు జరిగే అవకాశం...

తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం నుంచి లోట్రిడ్జికి వచ్చే రహదారిలో ప్రకాశం విగ్రహం సమీపంలో కెనాల్ భారీగా కోతకు గురైంది. కాలువ కోతకు గురై రోడ్డు దిగువన మట్టి కెనాల్‌లోకి జారి పోయింది. దీంతో మిగిలిన రహదారి సైతం కోతకు గురై ప్రమాదాలు జరిగే అవకాశముందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దానికి తోడు నిత్యం వేలాది వాహనాలు ఆ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అందులోనూ రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు కోతకు గురైన ప్రాంతంలోనే ఆటోలు, బస్సులు ఇతర వాహనాల దిగి ముందుకు స్టేషన్ ప్రాంగణంలోకి వెళ్తుంటారు. దీంతో రాత్రి వేళల్లో దానిని గుర్తించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయంటూ స్థానిక ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తుంది. అలాగే గద్ద బొమ్మ సమీపంలోని పూలమార్కెట్‌కు వెళ్లే వంతెన దిగువన కోతకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రోడ్డు దిగువన బలహీనంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



కోతకు గురైన కెనాల్ వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టిన అధికారులు

వర్షాలతో మరింత భయం....

రోడ్డు దిగువన కెనాల్‌లోకి మట్టి జారిపోతుండటంతో స్థానికులను ఆ ప్రాంతం ఆందోళన కలిగిస్తుంది. అయితే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మట్టి త్వరగా జారిపోయే అవకాశముందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మట్టి జారటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుతుంది. అంతేకాకుండా రోడ్డుకు కోతకు గురైన ప్రాంతంలో నగరపాలకసంస్థ సిబ్బంది ప్రమాద హెచ్చరికలతో బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణం దానిపై చర్యలు చేపట్టాలని సర్వత్రా విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏపీజే అబ్దుల్ కలాం సేవలు అపూర్వం



నివాళులర్పిస్తున్న వెలంపల్లి ఇతర నేతలు



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వించిపేట(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా ఆధ్వర్యంలో ఆదివారం వించిపేట, నైజాంగేటు సెంటర్‌లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాలకు మార్గనిర్దేశం చేసిన గొప్ప దార్శనికుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. రాష్ట్రపతిగా ఎదిగిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని చెప్పారు. దేశ భవిష్యత్తుకు యువత చేతుల్లో ఉందని, వారు కలలు కని వాటిని సాధించుకున్నప్పుడే దేశం అభివృద్ధితో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. ఆయన చెప్పిన మార్గంలో నేటి యువత ముందుకు వెళ్లాలని కోరారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్, పశ్చిమ నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు బత్తుల పాండు, నాయకులు మజ్జి శ్రీనివాస్, మండల శీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో....

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్‌కలామ్ దేశానికి అందించిన సేవలు అపూర్వమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ జిల్లా మైనారిటీ విభాగ అధ్యక్షులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి ఆదివారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ అబ్దుల్‌కలాం భారత దేశానికి అనేక సేవలందించారని కొనియాడారు. యువత అందరు అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రపతి పదవికే వన్నె తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ ఇర్ఫాన్, పార్టీ మైనార్టీ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌రావు పార్కులో అబ్దుల్ కలాం వర్ధంతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావు పార్కులో ఆదివారం అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత కలాం చిత్రపటానికి వాకర్స్ ఎన్టీఆర్ జిల్లా గవర్నర్ ఎ.విజయలక్ష్మీ విచ్చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వాకర్స్‌కు 30 కుర్చీలను అందచేశారు. యోగా నిర్వహణకు అవసరమైన మైక్‌ను అసోసియేషన్‌కు చెందిన జగుపిళ్ళ శ్రీనివాసరావు అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శివకుమార్ పట్నాయక్, జగుపిళ్ళ శ్రీనివాసరావు, బీరం శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బధిరుల బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాతీయ బధిరుల బ్యాడ్మింటన్ ఛాంపియన్స్ షిప్ పోటీల్లో ఎన్టీటీపీఎస్‌కు చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నాగుర్ పాషా రన్నరప్‌గా నిలిచాడు. చెన్నై రాయపేటలో వెస్లీ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ చాంపియన్ షిప్ ఫైనల్ పోటీలో నాగుర్‌పాషా ద్వితీయస్థానంలో నిలిచాడు. కొండపల్లికి చేరుకున్న ఆయనకు ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

కరాటే పోటీల్లో భవిత్ రెడ్డి ప్రతిభ



భవానీపురం(విజయవాడ పశ్చిమ): జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో కరాటే పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపిన చిన్నారి కేసరి భవిత్ రెడ్డిని పలువురు అభినందించారు. భవానీపురం శ్రీచైతన్య పాఠశాలలో ఐదవ తరగతి చదువుతూ నగరంలోని జేకే గోజు రై కరాటే అకాడమీలో శిక్షణ పొంది నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొని నాలుగు పతకాలు, అలాగే రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పదికిపైగా పతకాలను భవిత్ రెడ్డి సాధించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ గుత్తా ప్రదీప్ మాట్లాడుతూ చిన్న వయసులోనే కరాటే విద్యలో నైపుణ్యాన్ని సంపాదించి వివిధ స్థాయిల్లో పతకాలు సాధించటం పాఠశాలకు గర్వకారణమన్నారు. చదువుతోపాటు కరాటే విద్యలోనూ ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు కేసరి రాజశేఖర్ రెడ్డి అభినందనీయులన్నారు. అభినందించినవారిలో స్కూల్ ఈజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్‌బాబు, ప్రైమరీ ఇన్‌చార్జ్ కవిత, కేసరి లక్ష్మీరెడ్డి ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడంతో పాటు ట్రూ అఫ్ చార్జీలను రద్దు చేయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆంజనేయులు, సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్‌లు, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయ సత్యబాబులు పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీలు రెట్టింపు అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయం దాచి పెట్టి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించిన ఇళ్లకు అధికంగా బిల్లులు వస్తున్నాయనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. సమావేశంలో మహిళా సంఘాల నాయకులు జి. ఆదిలక్ష్మీ, పి. దుర్గాంబ, నేతలు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు